క్లుప్తంగా

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు తాడేపల్లిగూడేనికి బదిలీ అయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలరావు సుమారు రెండు సంవత్సరాలుగా తెనాలిలో విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తాడేపల్లిగూడెం పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు. మచిలీపట్నంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.అనూషను తెనాలికి బదిలీ చేశారు. రెండు మూడు రోజుల్లో వీరు బదిలీ స్థానాల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

ముగిసిన అంకమ్మతల్లి సంబరాలు

నగరం: మండలంలోని తాడివాకవారి పాలెంలో వారం రోజులుగా జరుగుతున్న అంకమ్మ తల్లి సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారి ఘటాలను శాస్త్రయుక్తంగా ఆలయంలో పునఃప్రవేశపెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకమ, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

తెనాలి చేరిన 'విద్యాకానుక'



తెనాలిఅర్బన్: జగనన్న విద్యాకానుక కిట్లు కొంత భాగం గురువారం తెనాలి చేరాయి. గుంటూరు నుంచి విద్యాశాఖ ఉన్నతాధికారులు వీటిని తెనాలి పంపారు. కొత్తపేట బాలురోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో వీటిని భద్ర పరిచారు. తెనాలికి 33,529 టెక్స్ట్ బుక్స్, 12,041 యూనిఫాంలు, 1291 డిక్షనరీలు వచ్చినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మిగిలినవి మరీ కొద్ది రోజుల్లో వస్తాయని వెల్లడించారు. కిట్‌లోని యూనిఫాం, పుస్తకాలు తదితరాలను ఆయన పరిశీలించారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ




శిరిపురం(కొల్లిపర): శిరిపురం గ్రామంలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య తిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ విచ్చేసి, పూజలు చేశారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



తెనాలిఅర్బన్: బాలనాగు ఉమానాగ హర్షవర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ సాయి ప్రసాదం సేవా సమితీ ఆధ్వర్యంలో చినరావూరులోని పేదలకు గురువారం ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమితి నిర్వాహకులు లక్కరాజు సాయి, ఎస్‌బీఐ అధికారి రవీంద్ర, సమితి సభ్యులు అఖిల్, రొంపిచర్ల సురేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష తులసి పూజ నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళి, చంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్ష్మి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ పాలన

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగి ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.1,500 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు అందించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. అంగలకుదరు గ్రామానికే రూ. 21 కోట్ల లబ్ధి చేకూరిందని, గ్రామంలో 264 మందికి కాపు నేస్తం, 254 మందికి ఈబీసీ నేస్తం కింద లబ్ధి చేకూరుతోందని వివరించారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గడప గడప కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటినీ నాలుగు నెలల్లో పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలతో మాట్లాడుతూంటే 80 శాతం ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తిగా ఉన్నారని తెలుస్తోందన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నేతలు జగన్‌మోహనరావు, తిన్నలూరి శ్రీనివాసరావు, చుండూరు గోపి, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

అభిలాష చిత్రాన్ని ఆదరించండి

మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దిలీప్‌రాజా, సుధాకర్

తెనాలిఅర్బన్: అభిలాష సినిమాలో పది మంది తెనాలికి చెందిన నటీనటులు వెండితెరకు పరిచయం కావడం శుభపరిణామమని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. అభిలాష సినిమాలో ప్రతి నాయకుడు పాత్ర పోషించిన బెల్లంకొండ వెంకట్ అభినందన సభను కవిరాజా పార్కులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిలాష చిత్రం శుక్రవారం విడుదల కానున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు సంగమేశ్వర థియేటర్‌లో ఉచిత ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. నటీనటుల కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, రాజకీయ నేతలు సినిమాను చూడాలని కోరారు. నటీనటులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో మా ఏపీ ఆధ్వర్యంలో శని, ఆది వారాల్లో కూడా ఉదయం 9గంటలకు ఉచితంగా సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. బెల్లంకొండ వెంకట్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే అభిలాష సినిమా పోస్టర్‌లను ఆవిష్కరించారు. సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్, డాక్టర్ పావని ప్రియాంక, మిలటరీ ప్రసాద్, పినపాటి సురేష్‌బాబు, దేవిశెట్టి కృష్ణారావు, కన్నెగంటి మధు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులకు అడ్డుకట్ట



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారిణి బీబీజాన్

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధులను అరికట్టవచ్చని వైద్యాధికారిణి డాక్టర్ షేక్ బీబీజాన్ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం నందులపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. వ్యక్తిగత శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. దోమ తెరలు ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, భాస్కర్, మున్నంగి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ



వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్మన్ ముంతాజ్ పఠాన్

తెనాలిటౌన్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దివ్యాంగుల సంస్థ చైర్మన్ ముంతాజ్ పఠాన్ తెలిపారు. కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అయిదుగురు దివ్యాంగులకు మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలను ఎమ్మెల్యే శివకుమార్, సంస్థ చైర్మన్ ముంతాజ్ పఠాన్ అందజేశారు. కోపల్లె, చావావారిపాలెం, కఠెవరం, నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లో ఒక్కొక్కరికి వాహనాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, ఈఓపీఆర్డీ ప్రభాకర్, కార్యాలయ ఏఓ ప్రతాప రెడ్డి, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

తెనాలిరూరల్: చట్టాలపై అవగాహన కోసం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ పేర్కొన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం సోమసుందరపాలెం గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నియంత్రణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో చేర్పడం నేరమని, మొదటిసారి ఈ నేరం చేసినట్లయితే..కనిష్టంగా 3 నెలలు, గరిష్టంగా ఏడాది వరకు జైలుశిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. జైలు శిక్షతో పాటు కనిష్టంగా రూ. 10 వేలు, గరిష్టంగా రూ. 20 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థలో అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



తెనాలి అర్బన్: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బంగారపు పని కార్మికుడు సింహాద్రి ఆనందకుమార్ (39) గుండెపోటుతో బుధవారం మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును మృతిని భార్యకు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు గురువారం అందజేశారు.

4న గ్రూప్-1, గ్రూప్-2పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 4న అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో జరిగే సదస్సులో గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్న సదస్సులో పాల్గొనే అభ్యర్థులు 040-35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

4న పెయింటింగ్ పోటీలు

పాత గుంటూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 4న బ్రాడీపేట 2వ లైనులోని బాలానంద కేంద్రంలో ఉదయం 10 గంటలకు విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు 'శ్లోక హ్యూమానిటేరియన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ విజయగౌరి తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులు పేర్లను 9010161799 నంబర్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం



బోర్డుపై హాల్‌టిక్కెట్ నంబర్లు

తెనాలిఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వసిద్ధం చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. తెనాలి డివిజన్ పరిధిలో పది కేంద్రాలను అధికారులు కేటాయించారు. తెనాలి పట్టణ పరిధిలోని బాలికోన్నత పాఠశాల, కేఎస్ఎం హైస్కూల్, ఎన్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్, మంగళగిరి పరిధిలోని సీకే జూనియర్ కాలేజ్, మున్సిపల్ హైస్కూల్, తాడేపల్లిలోని జెడ్పీ హైస్కూల్, దుగ్గిరాలలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, చేబ్రోలులోని ప్రెసిడెన్సి హైస్కూల్, పొన్నూరులోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌లను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వీటిలో 2,600మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత విజయరామరాజుకు నివాళి



నివాళులర్పిస్తున్న మోహనరావు, నరసింహారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల హక్కుల సాధన, సంక్షేమం కోసం పాటుపడిన ఉద్యమ నిర్మాతల్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు తెలిపారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం ఉపాధ్యాయ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ వీణా విజయ రామరాజు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన ఉపాధ్యాయ ఉద్యమ పితామహునిగా వీణా విజయరామరాజు చిరస్మరణీయుడన్నారు. ఉపాధ్యాయ వాణి సంపాదకునిగా ఆయన సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్లు డి.ఎ.జోసెఫ్, ఎం.పి.సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు పేరేచర్ల శ్రీనివాసరావు, కె.వి.రమణ, బి. విజయబాబు పాల్గొన్నారు.

హోరా హోరీగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ

కొల్లూరు : యువత క్రీడల్లో రాణించే విధంగా.. ప్రోత్సహించే ధ్యేయంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారకార్థం కొల్లూరులో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు మేరుగ చందన్‌నాగ్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మారక హార్డ్ టెన్నిస్ బాల్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. 96 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఇప్పటి వరకు 72 జట్లు పోటీ పడి 36 జట్లు రెండో రౌండుకు అర్హత సాధించాయి. మరో 24 జట్లు మొదటి దశలో పోటీ పడనున్నాయి. గురువారం ఐదు మ్యాచ్‌లు నిర్వహించగా, కొల్లూరు రెడ్ ఆర్మీ-2 జట్టుపై మోపర్రు జట్టు విజయం సాధించింది. కోళ్లపాలెం, భట్టిప్రోలు (ఆర్‌సీబీ) జట్ల పోరులో భట్టిప్రోలు (ఆర్‌సీబీ) జట్టు గెలుపొందింది. పల్లెకోన జట్టు వరహాపురం జట్టుపై పోటీపడి గెలుపును దక్కించుకుంది. ఈపూరు (చైత్రభూమి), బోస్‌నగర్ జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో ఈపూరు జట్టు గెలుపొందగా, మోదుకూరు చాలెంజర్స్ జట్టుపై ఆడిన వేటపాలెం జట్టు విజయం సాధించింది. క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌లు, ఓడిన జట్లకు ప్రోత్సాహక బహుమతులు క్రికెట్ బ్యాట్‌లను మేరుగ చందన్‌నాగ్, ఎంపీటీసీ సభ్యురాలు గరిక నీలిమ అందజేశారు. బొద్దులూరుపాడు సర్పంచ్ గుర్రం మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, బొర్ర నాగేశ్వరరావు, ఎరగ్గల్ల పోతురాజు అందజేసిన వారిలో ఉన్నారు. పోటీలను పాలిమేర నవీన్‌రెడ్డి, పర్యవేక్షిస్తున్నారు.

3న విజ్ఞాన మందిరంలో డ్యాన్స్ సోలో పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్ తదితరులు

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 3న వెస్ట్రన్ డ్యాన్స్ సోలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు నగరంలోని వివిధ డాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె.వి. రమేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉదయకుమార్, సభ్యులు రాజా, వెంకట్, కరీం, రాజాసింగ్ పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవాలు ప్రారంభం



మలేరియా మాసోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ

మంగళగిరి: మలేరియా నివారణపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలని డాక్టర్ అనూష అన్నారు. మలేరియా మాసోత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం నగరంలో గణపతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మాసోత్సవాలను ప్రారంభించిన డాక్టర్ అనూష మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో బ్యాక్టీరియా, క్రిములు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మిలు పాల్గొన్నారు.

నవ వధువును చంపే ప్రయత్నం చేసిన భర్త

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



తాడేపల్లిరూరల్: పట్టణంలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద గురువారం రాత్రి కొత్తగా వివాహమైన ఓ యువకుడు తన భార్యను నీళ్లలో ముంచి చంపే ప్రయత్నం చేయగా మత్స్యకారులు గమనించడంతో ఆ యువతి ప్రాణాలతో బయటపడింది. ఆ యువకుడిని మత్స్యకారులు పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరానికి చెందిన నాయుడు బాలాజీకి, మరదలు లక్ష్మీ దుర్గకు మూడు నెలల కిందట వివాహమైంది. విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చిన దంపతులు దర్శనం అనంతరం తాడేపల్లిలోని పుష్కర ఘాట్‌కు వచ్చారు. నీళ్లల్లో దిగుదామని భార్యతో చెప్పి బాలాజీ నీళ్లలో ముంచాడు. లక్ష్మీ కేకలు వేయడంతో చేపల వేటకు వచ్చిన వారు లక్ష్మీని రక్షించి పోలీసులకు అప్పజెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

దంతలూరు(కొల్లిపర): దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించి, తగు జాగ్రత్తలు వివరించి, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. గురువారం దంతలూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 9న జరగనున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో గర్భిణులు పాల్గొన్ని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, తమ్మ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ రాచకొండ నాగమల్లేశ్వరరావు, ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు రక్షణ కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తెనాలిఅర్బన్: మహిళ రెజ్లర్లకు కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా, ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తెనాలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచే చేను మేసిందన్న చందాన రెజ్లర్ల అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడం అమానుషమన్నారు. వెంటనే ఆయనను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై పోలీసులు వేధింపులు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, కె.రవి కుమార్, ఎం.సాంబశివరావు, పి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, పి.పాములు, నల్లయ్య, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పెదకోనేరు పునర్నిర్మాణం చారిత్రాత్మకం

- కమ్యూనికేషన్స్ విభాగం ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్
- కోనేరు విశిష్టతను వివరించిన ఎమ్మెల్యే ఆర్కే



పెదకోనేరు పనులను పరిశీలిస్తున్న సలహాదారు జీవీడీ కృష్ణమోహన్, ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ఎంతో పురాతనమైన, విశిష్టత కలిగిన మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ పెద కోనేరు (కల్యాణ పుష్కరణి) పునర్నిర్మాణం చేపట్టడం చారిత్రాత్మకమని కమ్యూనికేషన్స్ ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగరంలోని పెదకోనేరును గురువారం కృష్ణమోహన్ పరిశీలించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పెదకోనేరు చరిత్రను వివరించడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులను వివరించారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన పెదకోనేటిలోని నీరు నృసింహ స్వామి వారికి పూజలు, అభిషేకాలు, నిత్యపూజలు నిర్వహించడంతోపాటు చుట్టుపక్కల ప్రజలకు నీటి అవసరాలు తీర్చేదన్నారు. కాలక్రమేణ కోనేరులోని నీటిని వాడకపోవడంతో పాడుపడిపోయిందన్నారు. రూ.1.50 కోట్లతో పెదకోనేరుకు పూర్వ వైభవం తీసుకువచ్చి మరలా స్వామి వారికి సేవలు అందించేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆర్కే వివరించారు. అంతేకాక కోనేరు నిర్మాణానికి కారణమైన పూర్వీకుల విగ్రహాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పెదకోనేరు ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే ఆర్కే తీసుకున్న చొరవ, కృషి అభినందనీయమని కొనియాడారు. చారిత్రక సంపదలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

బెదిరించి డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

మంగళగిరి: బడ్డీ కొట్టుల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ క్రాంతి కిరణ్ గురువారం వివరాలను వెల్లడించారు. మంగళగిరి గండాలయపేటకు చెందిన చెన్నుపల్లి మోహన్ కొంతకాలంగా బడ్డీ కొట్ల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. యర్రబాలెంలో బడ్డీ కొట్టు నడుపుతున్న ఆకుల శివనాగరాజును ఏడు నెలలుగా బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. అనుమానం వచ్చిన శివనాగరాజు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మోహన్‌ను అరెస్ట్ చేశారు.